## క్లుప్తంగా

### 20 నుంచి ఆధార్‌లో మార్పులు

కొత్తపట్నం: సచివాలయాల్లోనే ఆధార్ కార్డుల్లో మార్పులు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసిందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. ఆరు రకాల మార్పులకు అవకాశం ఉందన్నారు. కొత్త ఆధార్ కార్డు, బయోమెట్రిక్, వేలిముద్రల అప్డేట్, ఆధార్‌లో మార్పులు, ఆధార్ ప్రింట్, డాక్యుమెంట్ అప్డేట్, పుట్టిన తేదీ మార్చడం వంటి సేవలకు అవకాశం ఉందన్నారు. పుట్టిన తేదీల్లో మార్పులు చేయాలంటే సరైన ఆధారాలు ఉండాలన్నారు. ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కార్డుల్లో మార్పులు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 20న అల్లూరు, 21న కె.పల్లెపాలెం, 27న ఈతముక్కల, 28న మడనూరు, 29న మోటుమాల గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

### శిక్షణ కేంద్రంగా కె.పల్లెపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ



కె.పల్లెపాలెం ఎస్‌డబ్ల్యూపీసీని తనిఖీ చేస్తున్న డీపీవో నారాయణరెడ్డి

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): మండలంలోని కె.పల్లెపాలెం ఎస్‌డబ్ల్యూపీసీని శిక్షణ కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. కె.పల్లెపాలెం ఎస్‌డబ్ల్యూపీసీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు ఎస్‌డబ్ల్యూపీసీలను శిక్షణ కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిలో కె.పల్లెపాలెం ఎస్‌డబ్ల్యూపీసీ ఒకటని అన్నారు. ఒంగోలు డివిజన్‌లోని ప్రతి మండలం నుంచి గుర్తించబడిన రెండేసి గ్రామాలకు ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అందుకు తగిన మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ఎస్‌డబ్ల్యూపీసీని ఏ విధంగా నడుపుకోవాలి, తడి, పొడి చెత్త ఏ విధంగా తేవాలి, ఎరువులు ఎలా తయారు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు పంచాయతీల వారీగా శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామికి శనివారం ప్రత్యేక పూజలు అర్చకులు పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. పాపావిమోచన ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోతర, సహస్రనామ పూజలు చేశారు. భక్తులు హాజరై పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు**

మార్కాపురం టౌన్: భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి శనివారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, సహస్రనామార్చన పూజల అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

### గంగమ్మ తల్లికి పూజలు

కొనకనమిట్ల: వెలుగొండ సన్నిధిలోని గంగా భవాని ఆలయంతో పాటు బలిహోర గంగమ్మ తల్లి ఆలయాల్లో శనివారం భక్తులు పూజలు చేశారు. వెలుగొండ శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం కమిటీ ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టారు. ముందుగా ఉత్సవం నిర్వహించి నైవేద్యాలు సమర్పించి గంగమ్మతల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో యాదవ అన్నదాన సత్రం కమిటీ అధ్యక్షుడు సాదం వీరయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, కోశాధికారి పిన్నెక నాగేశ్వరరావు, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, మోడి ఆంజనేయులు, లక్ష్మణ, గుమ్మా నాగార్జున, ఉప్పుటూరి కాశయ్య, అంకాల వెంకటేశ్వర్లు, బాలయ్య, కడెం అల్లూరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సమస్యల కూత..!

- అభివృద్ధికి నోచుకోని కరవది రైల్వేస్టేషన్
- ప్రయాణికులకు ఇబ్బందులు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది రైల్వేస్టేషన్ అభివృద్ధికి నోచుకోకపోవడంతో సమస్యలు మోతమోగిస్తున్నాయి. రెండేళ్ల క్రితం స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు, మౌలిక వసతులు కల్పించారు. కానీ, ప్రస్తుతం ప్రమాదం అంచున ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో ఉన్న ప్లాట్‌ఫారాలను 3వ లైన్ నిర్మాణంలో భాగంగా తొలగించారు. 3వ లైన్ ఏర్పాటుతో కరవది రైల్వేస్టేషన్‌కు స్థానచలనం కలిగి మరో ప్రాంతంలో నిర్మించారు. 1వ నంబర్ ప్లాట్‌ఫాంను పూర్తిగా తొలగించారు. కొత్త నిర్మాణాలు చేపట్టారు. గతంలో ప్రయాణికులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో స్టేషన్‌లో టికెట్ తీసుకుని 3, 4 లైన్లలో వచ్చే ట్రైన్ ఎక్కేందుకు 1, 2 లైన్లలో ఉన్న ట్రైన్లను దాటేవారు. ఆ క్రమంలో సుమారు నలుగురు రైల్వే ఉద్యోగులు ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. మరికొందరు శాశ్వతంగా వికలాంగులయ్యారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల సంఘం విజ్ఞప్తిని ఆలకించిన రైల్వేశాఖ.. వెంటనే 1వ నంబర్ ప్లాట్‌ఫాం, 4వ నంబర్ ప్లాట్‌ఫాం నిర్మాణం చేపట్టి చివరి భాగంలో ఏటవాలుగా ఏర్పాటు చేయడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులకు సర్కస్ ఫీట్లు కూడా తప్పాయి. అయితే, ఇటీవల 3వ లైన్ నిర్మాణంలో భాగంగా పాత స్టేషన్‌ను తొలగించి ప్లాట్‌ఫాంల మార్పు జరిగింది. అదే క్రమంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వసతుల కల్పన మాత్రం శూన్యంగా ఉంది. ఎంతో కాలంగా ఒంగోలు మండలానికి ఏకైక రైల్వేస్టేషన్‌గా ఉన్న కరవది నుంచి 10 గ్రామాల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ, సౌకర్యాల కల్పనలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గతంలో 4వ నంబర్, 1వ నంబర్ ప్లాట్‌ఫారాలపై ఉన్న మరుగుదొడ్లు మూలనపడ్డాయి. లైట్ల నిర్వహణ లేకపోవడంతో అసాంఘిక శక్తుల ఆగడాలు హెచ్చుమీరాయి. గతంలో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్ల గస్తీ తిరిగేవారు. ప్రస్తుతం వారు కనిపించడం లేదు. కరవది నుంచి ఒంగోలు ఫిల్టర్ చేయబడిన నీటిని రైల్వే అవసరాల కోసం 24 గంటలు పంపింగ్ చేస్తుంటారు. అడుగున్నర వ్యాసంతో ఒంగోలుకు పంపింగ్ జరుగుతున్న నీటితోనే కరవది ప్లాట్‌ఫాంలకు కూడా నీరు అందించాలన్న ఆలోచన రైల్వే శాఖకు లేకపోవడం గమనార్హం. సమస్యలన్నీ పరిష్కరించడంతో పాటు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కూడా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాంలు లేని కరవది రైల్వేస్టేషన్

# ఆటల పోటీల విజేతలు వీరే



కబడ్డీ ఆడుతున్న యువకులు

ఒంగోలు: బాలినేని వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి చారిటబుల్ ట్రస్టు సహకారంతో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వర్షం కారణంగా శుక్రవారం సాయంత్రం జరగాల్సిన వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌ని శనివారం నిర్వహించారు. స్థానిక మినీ స్టేడియంలో షటిల్ డబుల్స్, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.7,500, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు బహుమతిగా ఇవ్వనున్నారు. వర్షం కారణంగా ముగింపు ఉత్సవాన్ని వాయిదా వేశారు. విజేతల వివరాలను లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సోమినేని సురేష్ వెల్లడించారు.

**కబడ్డీ విజేతలు** : కొత్తపట్నం నాని ఫ్రెండ్స్ (ప్రథమ), కరేడు సాగర్ టీం (ద్వితీయ), భజరంగభళి స్పోర్ట్స్ క్లబ్, కనపర్తి (తృతీయ)



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న రాహుల్, గోవింద్ - తేజ, కిరణ్ జట్లు

**వాలీబాల్ విజేతలు** : కొత్తపట్నం మండలం వజ్జిరెడ్డిపాలెం (ప్రథమ), టీఆర్‌ఆర్ కాలేజీ, కందుకూరు (ద్వితీయ), కరవది, ఒంగోలు మండలం (తృతీయ)

**షటిల్ డబుల్స్** : ఆర్.రాహుల్, జి.గోవిందు (ప్రథమ), కే తేజరాజ్, జి.కిరణ్‌కుమార్ (ద్వితీయ), డి.పోతురాజు, ఎస్‌కే చాంద్ అలీష్ (తృతీయ)

# అంకితభావంతో పనిచేయండి

- ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు



సమీక్షిస్తున్న ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్: సచివాలయ కార్యదర్శులు అంకితభావంతో ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్, ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో ఒంగోలు మండలంలోని సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నవరత్నాల పథకాలు అమలుచేస్తోందని, వాటిని అర్హులైన ప్రజలకు చేర్చే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని అన్నారు. అందులో భాగంగానే పేదలందరికీ గృహ వసతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, కానీ, కొందరు లబ్ధిదారులు గృహాల నిర్మాణంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. మీనమేషాలు లెక్కిస్తున్న వారిని గుర్తించి గృహ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం కల్పించిన ఆర్థిక ఆసరా, సబ్సిడీ గురించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. అవగాహన కార్యక్రమాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏపీఎం, వీవోఏల సహాయ సహకారాలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లోని జగనన్న లే అవుట్లలో నిర్మాణం ప్రారంభించిన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్లపై గ్రామాల వారీగా కమిషనర్ సమీక్షించారు. పథకాల అమలు, తీరుతెన్నులపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి

చీమకుర్తి: చీమకుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, ఎం.తిరుపతిరెడ్డి భరోసా ఇచ్చారు. వారితో పాటు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, ముప్పూరి చలమయ్య, అంబటి వీరారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 140 మంది విద్యార్థులు, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 24 మంది బాలికలకు రైటింగ్ ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. వచ్చే నెల 3 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు బాలికలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు కావాల్సిన ఆర్వో ప్లాంట్‌ను రోటరీక్లబ్ సహకారంతో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. వాటితో పాటు ఇతర సదుపాయాలను పాఠశాలలోని బాలికల సౌకర్యార్థం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.



బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు రైటింగ్ ప్యాడ్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

# మానవత్వం చాటుకున్న యూట్యూబర్



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ అరుణ, యూట్యూబర్ శ్రీదేవి, తదితరులు

- పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం
- శంకుస్థాపనకు హాజరైన ఎంపీపీ, నాయకులు

మద్దిపాడు: యూట్యూబర్ శ్రీదేవి మరోమారు మానవత్వాన్ని చాటారు. గత నెల 16వ తేదీ మద్దిపాడు మండలంలోని గార్లపాడు గ్రామంలో పర్యటించిన సందర్భంలో గ్రామంలో ఆడపిల్లను పెట్టుకుని చిన్న రేకుల ఇంట్లో నివసిస్తూ ఇబ్బంది పడుతున్న ముత్తనపల్లి రమణమ్మకు బాసటగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు వారికి ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. రమణమ్మకు ఇద్దరు కుమార్తెలు కాగా, 9 నెలల క్రితం భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. గత నెల గార్లపాడులో పేదలకు సహాయం చేసే క్రమంలో గ్రామంలో పర్యటించిన యూట్యూబర్ శ్రీదేవికి రమణమ్మ ఇబ్బందుల గురించి గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి తెలిపారు. ఆమెకు కనీస వసతులున్న ఇల్లు లేకపోవడాన్ని గమనించిన శ్రీదేవి.. ఇల్లు నిర్మించాలని నిశ్చయించుకున్నారు. అందులో భాగంగా శనివారం విశాఖపట్నం నుంచి గార్లపాడు వచ్చి రమణమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే గ్రామానికి చెందిన గంగయ్య అనే మేస్త్రి లాభాపేక్ష లేకుండా ఇల్లు నిర్మించేందుకు ముందుకు రావడంతో సర్పంచ్, ఎంపీపీల సమక్షంలో ఇంటి నిర్మాణంలో ముందు బేస్‌మెంట్ నిర్మాణానికి రూ.25 వేల చెక్కును శ్రీదేవి అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి మాట్లాడుతూ సాధారణంగా యూట్యూబర్లు తమ వ్యూయర్ షిప్ పెంచుకోవడానికి రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారని, కానీ శ్రీదేవి వారికి భిన్నంగా మానవత్వాన్ని ప్రదర్శిస్తూ రమణమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన డబ్బు మొత్తం ఇవ్వడానికి ముందుకు వచ్చారని అభినందించారు. ముందు ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము మాట్లాడుతూ తాను పడిన కష్టాలను మరిచిపోకుండా తనలాంటి తండ్రిలేని ఆడపిల్లలను ఆదుకోవడం కోసం శ్రీదేవి తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రమణమ్మకు ఇల్లు నిర్మించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# భూ హక్కు, భూ రక్ష సర్వేను పక్కాగా నిర్వహించాలి

- డీపీవో నారాయణరెడ్డి

కొత్తపట్నం: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని డీపీవో జీవీ నారాయణరెడ్డి సూచించారు. సర్వేపై శనివారం మండలంలోని రంగాయపాలెం, కె.పల్లెపాలెం పంచాయతీలను ఆయన సందర్శించారు. సర్వేలో భాగంగా ఓఆర్‌ఐ మ్యాప్‌ను పరిశీలించారు. సర్వే గురించి పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లను వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి, విలేజ్ సర్వేయర్, సచివాలయ సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆస్తి సర్వేను కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. అభ్యంతరాలు స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఈ సర్వేలో ప్రతి కార్యక్రమాన్ని రిజిష్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. సర్వే చేయడం వలన గ్రామ కంఠంలో నిర్మించుకున్న ఇళ్ల స్థలాలకు శాశ్వత గృహ హక్కు పత్రాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. శాశ్వత భూ హక్కు పత్రాలు ఇవ్వడం వలన ఆడిమానం, బ్యాంక్‌లో లోన్లు పెట్టుకోవడంతో పాటు మార్కెట్ ధర కూడా పెరుగుతుందన్నారు. గ్రామ కంఠాలకు సరైన డాక్యుమెంట్లు లేక వివాదాలకు దారితీస్తుందని, ఇప్పుడు పరిష్కారం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



రంగాయపాలెంలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో నారాయణరెడ్డి





### వైభవంగా రామలింగేశ్వరుడి తిరునాళ్ల



మట్టి శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న నాగసాధువులు

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో వేంచేసిఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయ 25వ వార్షిక తిరునాళ్ల శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి శివునికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు అన్నదానం చేపట్టారు. భారీ ఎలక్ట్రిక్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం హిమాలయ నాగ సాధువుల బృందంతో వివిధరకాల పత్ర, పుష్ప, ఫల రసాలతో మూడు అడుగులు మట్టి శివ లింగానికి గంటపాటు అభిషేకం చేశారు. స్వామి జ్ఞాన ప్రసన్నగిరిచే ఢమరుక ఘంట, శంఖారావంతో హరహర మహదేవ శంభోశంకర అంటూ శివనామ స్మరణతో కైలస వాతావరణంలో రుద్రాభిషేకం, భస్మాభిషేకం హరతులు, నివేదనలు చేపట్టారు. బల్లికురవ ఎస్సై వీ. వేమన తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

### మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

కొత్తపట్నం: రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజును రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి కోరారు. తాడేపల్లిలో శనివారం బీసీల ఇంటింటికి ప్రచారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాయల సుమతి హాజరై శిక్షణ అనంతరం మంత్రి అప్పలరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులకు వలలు, బోట్లు, వేట సామగ్రిపై సబ్సిడీని 40 శాతం నుంచి 75 శాతానికి పెంచాలని కోరారు. తమిళనాడు కడలూరు సోనా బోట్లు ఆంధ్రప్రదేశ్‌లో చొరపడి మత్స్య సంపద దోచుకెళ్తున్నాయని, అడిగిన వారి మీద దాడికి దిగుతున్నారని వివరించారు. ప్రత్యేకంగా మత్స్యకారులకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మత్స్యశాఖ మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణను కలిసి పలు సమస్యలపై సుమతి చర్చించారు. ఆమె వెంట వాయల రోశయ్య, పొక్కింగారి యానాది, తదితరులు పాల్గొన్నారు.



మత్స్యశాఖ మంత్రి అప్పలరాజుతో సుమతి

### గేట్‌లో ట్రిపుల్ ఐటీ ర్యాంకుల పంట

చీమకుర్తి: గేట్-2023లో జిల్లాకు చెందిన ట్రిపుల్ ఐటీ కాలేజీ ర్యాంకుల పంట పండించినట్లు కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి శనివారం తెలిపారు. 1000 లోపు 11 ర్యాంకులు, కాలేజీ మొత్తం మీద 58 ర్యాంకులు సాధించి మంచి ప్రతిభను సాధించినట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులను సాధించిన విద్యార్థులను అభినందించారు.



ర్యాంకులను సాధించిన విద్యార్థులతో ట్రిపుల్ ఐటీ కాలేజీ డైరెక్టర్ జయరామిరెడ్డి

# వాల్మీకుల అభ్యున్నతికి సీఎం కృషి

పెద్దదోర్నాల: రాష్ట్రంలోని వాల్మీకుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిరంతరం పాటు పడుతున్నారని కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ అలంపూరి మధుసూదనరెడ్డి కొనియాడారు. శనివారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి దైవదర్శనం నిమిత్తం వెళ్తూ మార్గమధ్యంలోని మండల కేంద్రంలో జిల్లా వాల్మీకి సంఘం నాయకులతో మాట్లాడారు. రాష్ట్ర వాల్మీకి సంఘం చైర్మన్‌గా, ఇప్పుడు ఎమ్మెల్సీగా నన్ను ఎన్నుకొని వాల్మీకులపై ఉన్న అభిమానాన్ని ముఖ్యమంత్రికి చాటారన్నారు. వాల్మీకీలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. రానున్న రోజులల్లో చట్టసభల్లో వాల్మీకుల సమస్యలపై తన వాణి వినిపించి ఓబీసీ రిజర్వేషన్లపై మాట్లాడతానని తెలిపారు. మంత్రుల సహకారంలో వాల్మీకుల సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. మండల కేంద్రంలోని వాల్మీకీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకీ కార్పొరేషన్ డైరెక్టర్ నలబోతుల కొండయ్య, అడ్వకేట్ భూపని కాశయ్య, బోగెం కాటంరాజు, బోగెం లక్ష్మయ్య, కన్నెగంటి శ్రీను, మీనిగ లక్షయ్య, మండ్లా వెంకటసుబ్బయ్య, మండ్లా వెంకటరంగయ్య, మండ్లా కాశీనాయుడు, నల్లబోతుల లాలాశ్రీను, నల్లభోతుల హరీష్, మండ్లా రమణయ్య తదితరులు పాల్గొని ఎమ్మెల్సీ డాక్టర్ అలంపూరి మధుసూదనరెడ్డిని సత్కరించారు.



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న జిల్లా వాల్మీకి సంఘం నాయకులు